# ఆఖరి పోరాటం

--యండమూరి వీరేంద్రనాథ్

***సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్.***

***ఆరో అంతస్థు.***

***మిగతా ఆఫీసుకీ దానికీ తేడా వుంది.***

ఆఫీసంతా అందరూ తిరగవచ్చు. కానీ ఆ అంతస్థు మాత్రం ఉన్నతాధికారులకీ, సి.బి.ఐ. ఆఫీసర్లు మాత్రమే పరిమితం. పూర్తి ఎయిర్‌కండీషన్ చేయబడ్డ విశాలమైన ఆ వరండాలో గోడలకి కంప్యూటరైజ్డ్ ఇనుప బీరువాలు తాపడం చేయబడి వున్నాయి. ఒక్కొక్క ఆఫీసర్‌కి ఒక్కొక్క కోడ్ నెంబర్ ఇవ్వబడుతుంది. అది మాత్రమే వారికి సంబంధించిన బీరువా తెరుస్తుంది. తమ పరిశోధన తాలూకు రిపోర్ట్‌లన్నీ వాళ్ళు అందులో దాచుకుంటారు. వాటిని వెల్లడి చేయవలసిన అవసరం వారికి లేదు.

లిఫ్ట్ ఆరో అంతస్థులో ఆగింది.

డిప్యూటీ కమీషనర్ ఆఫ్ సి.బి.ఐ బయటకు రాగానే దాని తలుపులు మూసుకోపోయాయి. ముఖద్వారం దగ్గిర గార్డు సెల్యూట్ చేశాడు. దాన్ని స్వీకరించి, లోపలికి అడుగు పెట్టగానే గార్డు తలుపు మూశాడు.

లోపల బాగా చలిగా వుంది. పొడవాటి గది. బ్యాంకులో లాకర్ల మాదిరి ఇనుప బీరువాలు..... తనకి సంబంధించిన 'అర' దగ్గిర నిలబడి, డిప్యూటీ కమీషనర్ మూడు బటన్స్ నొక్కగానే కంప్యూటర్ తన పని ప్రారంభించింది.

"786"

"క్యాచ్ వర్డ్ ప్లీజ్ ..... " కంప్యూటర్ అడిగింది.

"బంగాళాఖాతం."

"లోతెంత?"

"76184 అడుగులు."

కంప్యూటర్ సంతృప్తి చెందినట్లు - తలుపు తెరుచుకుంది. అందులో వుంది.....

***" రెడ్‌ఫైల్"***

దేశాన్ని దోచేసే అత్యంత క్లిష్టమయిన కేసుల్లో - అతి దారుణమైన మేధావంతులయిన నరరూప రాక్షసుల కోసం మాత్రమే వాడే ఫైల్!!

దాదాపు రెండు సంవత్సరాలు వంటరిగా పరిశోధించి మూడో కంటికి తెలియకుండా ఎన్నోవిషయాలు శోధించి ఒక్కొక్క పేజీ చొప్పున నిర్మించుకుంటూ వచ్చిన ఫైల్!!

ఆ రోజు దాని విషయాలు అందరికీ వెల్లడి చేయబడతాయి. సి.బి.ఐ. ఆఫీసర్లందరూ

అలర్ట్ చేయబడతారు.

నాలుగో అంతస్థులో మరో పదినిమిషాల్లో జరగబోయే మీటింగ్‌లో తను వెల్లడి చేయబోయే విషయాలు బాంబుల్లా పేలబోతాయని డిప్యూటీ కమీషనర్‌కి తెలుసు. దేశ ప్రజలు ఎంతో గౌరవప్రదంగా చూసుకునే ఒక వ్యక్తి గురించి రెండు సంవత్సరాలుగా, అదే జీవిత లక్ష్యంగా నిర్మించుకుంటూ వచ్చిన ఫైల్.

దాని వివరాలు ఈ రోజు మీటింగ్‌లో వెల్లడి చేయబడతాయి.

*　　*　　*　　*

"డియర్ ఫ్రెండ్స్ ....."

డిప్యూటి కమీషనర్ చెప్పడం ప్రారంభించినారు, ఆఫీసర్లింకా షాక్ నుంచి తేరుకోలేదు డి.సి. చేతుల్లో వున్న ఎర్ర ఫైల్‌ని చూసినప్పుడే కలకలం రేగింది.

డిపార్ట్‌మెంటులో నాలుగైదు కన్నా ఎక్కువ రెడ్ ఫైల్స్ లేవు. క్రైమ్ స్థాయిని బట్టి నీలం, పసుపు, నలుపు..... ఇలా ఫైళ్ళు ఏర్పాటు చేస్తాడు. దేశానికి అత్యంత ప్రమాదకరమైన టెర్రరిస్టులకీ, స్మగ్లర్‌లకీ మాత్రమే రెడ్ ఫైల్ ఉపయోగించటం జరుగుతుంది. అయినా దేశం మొత్తం మీద అలాంటి క్రిమినల్స్ నలుగురైదుగురే వున్నారు. ఇద్దరు లాకప్లో, ఒకడు పంజాబ్‌లో, మరొకడు స్వీడన్‌లో.

ఇంత కాలానికి మళ్ళీ ఫైల్ ..... ఎవరా వ్యక్తి?

## 1

ఆఫ్రికా దేశపు అరుదైన, అత్యంత ప్రతిష్టాకరమైన అల్‌మాండ్ జింక చర్మానికి, చైనా దేశపు కళాకారులు అల్లిన లేసుల ముఖముల్ బట్టమీద పరివేష్టతుడై కూర్చుని వున్నాడు అనంతానంతస్వామి. గోపురాకారంలో పదిహేను అడుగుల ఎత్తున ఆ విశాలమయిన హాలులో ప్రహరి గోడా ఒక అద్దంలా మెరుస్తూంది. జింక చర్మపు చివర్ల అమర్చిన అద్దంలో ఆ గదిశోభ ద్విగుణీకృతమవుతోంది. దక్షిణ భారతదేశపు శిల్పులు ఎంతో ఏకాగ్రతతో చెక్కిన శిల్పాలు ఆ గది స్థంభపు గోడలకి కొత్త వన్నె తెస్తున్నాయి. స్వామి కూర్చున్న మండపు పైన భాగంలో వున్న జపనీస్ షాండ్లియర్ రకరకాల కాంతుల్ని విరజిమ్ముతూంది. ప్రాచీన రోమన్ సాంప్రదాయపు పాత్రల్లో సుగంధ ద్రవ్యాలు ఎక్కువ వున్నాయి.

మొత్తం ప్రపంచంలోని అన్ని దేశాలూ ఆ గదికి తమ అంశనిచ్చాయి.

ఒక కాలు ముందుకు చాచీ, ఒక కాలు మడిచి, ఒక చెయ్యి వొళ్ళో పెట్టుకుని ఠీవిగా, కళ్ళూ సగం మూసి కూర్చుని వున్నాడు ఆయన.

ఒక అంగన నెమలి పించంతో ప్రశస్తమయిన మైసూరు గంధాన్ని ఆయన భుజానికి రాస్తోంది. మరొక లలన ఆయన కనుబొమ్మల్ని దిద్దుతోంది. ఒకనితంబిని పళ్ళెంలో కాళ్ళుపెట్టి కడుగుతోంది. మరొక అన్నుల మిన్న వింజామర వీస్తోంది.

అయిదు నిమిషాల్లో సేవ పూర్తయింది. ఆయన లేచాడు. అజానుబాహుడు, అరవింద దళాక్షుడు అయన నడుస్తుంటే అంగనలు నమ్రతగా పక్కకి తప్పుకున్నారు. విశాలమయిన కారిడార్స్‌లో నడుస్తుంటే సేవకులు వినయంగా తలవంచారు. కారిడార్ చివర పెద్ద హాలు. ఆయన ఆ హాలులోకి ప్రవేశించగానే, ప్రపంచపు వివిధ ప్రాంతాల్నుంచీ వచ్చిన భక్తులు దేశీయులు. ఒక్కసారిగా పెద్ద పెట్టున "అనంతస్వామికి జై" అని ముక్తకంఠంతో అరిచారు.

*　　　*　　　*

"అనంతానంతస్వామిని మీరెప్పుడయినా చూశారా?" డిప్యూటీ కమీషనర్ అడిగిన ప్రశ్నలకి అధికారులందరూ మొహామొహాలు చూసుకున్నారు.

" ..... అవును. ఈ ఫైలు అయన గురించే,

ఆనకట్టతెగి నదీ ప్రవాహం తోనుకు వచ్చినట్టు ఆ గదిలో కలవరం చెలరేగింది. సి.బి.ఐ ఆఫీసర్లన్న విషయం కూడా తాత్కాలికంగా మర్చిపోయి, వారిలో వారు మాట్లాడుకోసాగారు. డి.సి స్వరం కొనసాగింది.

" ..... ప్రధానమంత్రి దేశంలో ఏదైనా అనకట్టకి శంఖుస్థాపన చెయ్యాలంటే ఆయన దానికి ముహూర్తం పెట్టాలి. ముఖ్యమంత్రి గుళ్ళో విగ్రహస్థానం మారుస్తే దానికి ఆయన పూజ చేయాలి. హస్త సాముద్రికంలో ఆయనంత గొప్పవారు లేరని అధికార పక్షమూ, ప్రతిపక్షమూ ఏకగ్రీవంగా అంగీకరిస్తాయి ఆయన ఎవరిచెయ్యి అయినా చూసి, "నువ్వో నాలుగు రోజుల్లో చచ్చిపోతావు" అని చెప్తే, వారు మరణించడం ఖాయం. చిత్రమేమిటంటే, ఈ మరణించడం అనేది జ్వరంవల్లా, ఆక్సిడెంట్ వల్లా కాదు. అక్సిడెంట్ లాటి హత్యవల్లో, అత్యాచారం వల్లో జరుగుతుంది. ఇంత గొప్పగా ఆయన మరణాన్ని శాసింపగలడు. గత రెండు సంవత్సరాల్లోనూ దాదాపు డెబ్బైభమందికి ఆయన సాముద్రికం చెప్పాడు. ఆ డెబ్బైభమందీ మరణించారు. మరణాన్ని ఆ విధంగా ఆయన శాసిస్తాడు.

" ..... చనిపోయిన డెబ్బైభమందిలో యాభైమందికి రాజకీయాల్లో సంబంధం వుంది.

మత్తు పానీయాలూ, గంజాయి, మార్జువానా, స్త్రీలు, బంగారం, స్మగ్లింగ్-- వీటన్నిటిలో ఏది లాభసాటి వ్యాపారం? ఉహు. ఇవేమీ కాదు. అన్నిటికన్నా మంచి వ్యాపారం రాజకీయం!!! ఎలాగో ఒకలా ఒక వ్యక్తిని మంత్రిని చెయ్యి! పది శాతం కమీషన్ అడుగు, అయిదు సంవత్సరాల్లో కోటి రూపాయలదాకా వస్తుంది. ఆ కోటికో మళ్ళీ పది శాతం ఖర్చు పెడితే. ఒక స్థానం ఖాళీ చేయించడానికి ఒక మంత్రిని లంచగొండి అని నిరూపించి, రాజీనామా చేయించవచ్చు. ప్రతిపక్షం మీటింగ్‌లో బాంబులు పెట్టి ఇద్దరు ముగ్గుర్ని చంపి అది ఆధికార పక్షమే చేసిందని బాంబులు ఎట్టి ఇద్దరు ముగ్గుర్ని చంపి అది అధికార పక్షమే చేసిందని ప్రజల్లో భ్రాంతి కలిగించవచ్చు - అనంతానంత స్వామి టెక్నిక్ ఇదే--"

గదిలో అధికారులు విస్తుబోయి వింటున్నారు. అంగవైకల్య చాలానంద ట్రస్టు వృద్ధ

దాదాపు నాలుగు వందల కోట్ల ధనానికి ఆయన అధికారి. అలాంటి వ్యక్తిమీద సి.బి.ఐ ..... డి.సి. స్వరం తిరిగి వినిపించింది.

"హిందువులు స్వతహాగా సహన శీలురు. ఆ గుణమే వారిలో లేక పోతే దేశం ఇలా వుండేది కాదు. దేశపు మైనారిటీ సుస్థిరతా భావం తగ్గేకొద్దీ అలజడి పెరుగుతుంది. సరీగ్గా ఈ పాయింట్‌నే పట్టుకున్నాడు అనంతానంతస్వామి. అయితే ఇదంతా ఎంతో సిస్టమాటిక్‌గా ఎవరికీ అనుమానం రాకుండా చేసాడు. దాదాపు ఇరవై సంవత్సరాల కృషి వుంది దీని వెనుక.

మతం ఆయన అయుధం! వెపన్!!!

రాజకీయం ఆయన ఆట! గేమ్!!!

ఆయన విమానం దిగుతూ వుంటే వందమంది పూర్ణ కుంభాలతో నిలబడి వుంటారు. విదేశాలకు వెళ్తే విదేశాంగ మంత్రి వీడ్కోలు ఇస్తాడు.

ఇంత మహోన్నతమయిన వ్యక్తి మత పరిరక్షకుడు, రాజకీయాధి నేతా, నిర్ణయ నిర్దేశకుడు అయిన అనంతానంతస్వామి యొక్క చీకటి కోణాన్ని నేను రెండు సంవత్సరాలుగా శోధించాను. చాపక్రింద నీరులా వలపన్ని ప్రతిచర్యనీ భూతద్దంలో చూసి రికార్డు చేసాను. ఆ కాగితాలన్నీ ఈ ఫైల్‌లో వున్నాయి. ఆయితే అతడిమీద యాక్షన్ తీసుకునేటంత రుజువు ఏదీ నాకు లభించలేదు.

"ఈ రోజు సాయంత్రం అలాంటి రుజువు ఒకటి లభించ బోతూంది---"

ఆఫీసర్లందరూ ఉత్సుకతతో ముందుకి వంగారు. ఆ గదిలో సూది పడితే వినపడేటంత నిశ్శబ్దం అవరించింది.

" ..... ఈ రోజు సాయంత్రం రవీంద్ర కళాక్షేత్రంలో ఒక నాటక ప్రదర్శన జరగబోతూంది. ఇందిరాగాంధీ మహిళా కళాకారులు ఈ ప్రోగ్రామ్‌ని అనాధ బాలికల సహాయార్థం ఏర్పాటు చేసారు. కళాభారత అన్న సమాజంవారు ఈ ప్రదర్శన ఇస్తూంది. దీనికి అధ్యక్షత వహిస్తున్నది పరిశ్రమల మంత్రి సూర్యారావు. నాకు లభించిన రహస్య సమాచారం ప్రకారం అయన్ని అక్కడ హత్య చేయడానికి ప్రయత్నం జరుగుతూంది."

వింటున్న వాళ్ళు ఆసక్తిగా చూసారు. గుసగుసలు బయల్దేరాయి

"వారం రోజుల క్రితం స్వామి సూర్యారావు చెయ్యి చూస్తూ 'అపాయముంది నాయనా జాగ్రత్త' అని హెచ్చరించడం కాకతాళియం కావొచ్చు కానీ ఈ ప్రయత్నం జరుగుతూ వుండగా కనీసం ఒక టెర్రరిస్టునయినా మనం పట్టుకోగలిగితే ..... చాలా సమాచారం బయట పడవచ్చు. సరే ..... ఇంతకాలం ఈ విషయాలన్నీ నా ఒక్కడికే పరిమితం. ఈ రోజు మీ అందరి సహకారం కావలసి రావడంతో ఇన్నాళ్ళూ నేను సేకరించిన సమాచారాన్ని మీ ముందు వుంచుతున్నాను. ఈ ఫైల్ పూర్తిగా చదవండి. ఈ విషయాలన్నీ అత్యంత రహస్యంగా, గోప్యంగా వుంచాలని మీకు నేను చెప్పనవసరం లేదు. ఈ సాయంత్రం మనం అక్కడికి వెళుతున్నాం. మన కోడ్ కాలర్."

ఏర్పర్చుకుంటారు. ఆ కోడ్ చివరి నిమిషంలో మాత్రమే వెల్లడి చేయబడుతుంది. ఆ రోజు కాలర్ పైకి కాస్త లేపడం గుర్తు).

"సూర్యారావుగారిని ఈ రోజు ప్రదర్శనకి వెళ్ళడం మానుకోమన్న సలహా ఇద్దామా?" ఎవరో అడిగారు.

"మనకేదో ఆచూకీలందగానే మంత్రుల్ని ప్రోగ్రామ్‌లు మానుకొమ్మని సలహా ఇస్తే, దేశంలో ఒక్క ప్రముఖుడు కూడ బహిరంగంగా ఇక హాజరవడానికి వీలుండదు. మనం అక్కడ అయనకి రక్షిత వలయం ఏర్పరచాలి. వాళ్ళని పట్టుకోవడానికి ఇంతకన్నా మంచి అవకాశం మనకు రాదు. మన శక్తి సామర్థ్యాలు నిరూపించు కోవడానికి ఇంతకన్నా మంచి అవకాశం మరొకటిలేదు బెస్టాఫ్ లక్..... "

అందరూ నిశ్శబ్దంగా లేచారు.

అనంతానంతస్వామి చుట్టూ సి.బి.ఐ. వల!

సి.బి.ఐ. చరిత్రలో ఇంత పెద్ద అపరేషన్ గతంలో ఎప్పుడూ జరిగి వుండదు.

*           *           *           *           *           *

అందరి మనసులూ టెన్షన్‌తో నిండివున్నాయి.

ఆ విగ్రహాన్ని చూసి ఎవరూ అది ఒక గదిలోది అనుకోరు. బిర్లామందిర్ అంతర్భాగపు గర్భగుడికన్నా పదిరెట్లు విశాలంగా వుంది. విగ్రహమే ఆరడుగుల పొడవుంది. అనంతానంత స్వామి ఇంట్లో పడగ్గది పక్కనే వున్న పూజా మందిరం అది.

పట్టుపంచె సర్దుకుంటూ అక్కడికి హడావుడిగా ప్రవేశించాడు సి.బి.ఐ. చీఫ్. ఆయన మరో రెండేళ్ళలో రిటైరవ్వబోతున్నాడు. అనంతానంస్వామిని అపర భగవదవతారంగా చూస్తున్నాడాయన. భగవంతునికి వ్యతిరేకంగా ఎంక్వయిరీనా? అపచారం .....

రావడంతోనే స్వామి కాళ్ళమీద పడ్డాడు. "పది నిమిషాల క్రితమే మా డిపార్ట్‌మెంట్‌లో నాకో విషయం తెలిసింది స్వామీ! పరుగెత్తుకు వచ్చను ..... "

"ప్రజల ఉసురు రాముడికే తప్పలేదు. నీలాపనింద కృష్ణుడినే వదిలిపెట్టలేదు. నేనెంత నాయనా. ఎంక్వయిరీ రాని మంచిదేగా!"

ఛీఫ్ అదిరిపడి "మీకంతా తెలిసిందా స్వామీ?" అన్నాడు.

"నీ క్రింద అధికారి డిప్యూటీ కమీషనర్ మాట్లాడిన ప్రతీ మాటా నాకు తెలిసింది నాయనా"

ఛీఫ్ చేతులెత్తి నమస్కరిస్తూ, "మీరు కాలజ్ఞానులు మహాప్రభో! పది నిముషాల క్రితం జరిగిన రహస్య సమావేశం గురించి కూడ మీకు తెలిసిందంటే మీరు యుగపురుషులు! మీ మీద చర్య తీసుకోబోతున్నారంటే ఇక మాకూ, మా డిపార్ట్‌మెంట్‌కీ పుట్టగతులుడవు అంటూ ఏడ్చాడు.